మూగజీవాల దాహార్తిని తీర్చండి

పక్షుల కోసం నీటి ట్రేలను ఏర్పాటు చేసిన ఎంపీడీవో జర్నప్ప, ఆఫీసు సిబ్బంది

పెద్దేముల్, ఏప్రిల్ 26 : వేసవి దృష్ట్యా మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో జర్నప్ప కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పక్షుల కోసం ట్రేలలో నీటిని నిల్వ ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వేసవిని దృష్టిలో ఉంచుకొని పశువులు, పక్షుల దాహార్తిని తీర్చేందుకు పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లో ట్రేలు, నీటి తొట్టెల్లో నీటిని నిల్వ ఉంచాలని తెలిపారు. గ్రామాల్లో నీటి తొట్టెలకు ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వెన్నెల, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీనివాస్ గౌడ్, శ్రీశైలం, సిబ్బంది రాఘవేందర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మరమ్మతులకు రూ.16 లక్షలు

మండలంలోని 37 పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం, కనీస వసతుల కల్పనకు రూ.16 లక్షలు మంజూరయ్యాయని ఎంపీడీవో జర్నప్ప తెలిపారు. మొత్తం 58 పాఠశాలలు ఉండగా ఇటీవల అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశారని తెలిపారు. వీటిలో 21 పాఠశాలల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యుత్ సౌకర్యంతో కల్పించడంతో పాటు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, స్విచ్ బాక్స్‌లు ఏర్పాటు చేయించామన్నారు. 35 పాఠశాలల్లో కనీస వసతుల కల్పనకు మంజూరైన నిధులతో వెంటనే పనులను ప్రారంభించాలని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దోమ, ఏప్రిల్ 26 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2000-2001లో పదో తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం ఎస్‌జీ గార్డెన్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళానాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా కలుసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.వారికి విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్లడిగే నైతిక హక్కులేదు

బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

బొంరాస్‌పేటలో మాట్లాడుతున్న డీకే అరుణ

బొంరాస్‌పేట, ఏప్రిల్ 26 : ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లడిగే నైతిక హక్కు లేదని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. శుక్రవారం రాత్రి దుద్యాల, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సీఎంగా గెలిచిన తరువాత ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రధానమంత్రి అభ్యర్థే లేడని ఎద్దేవా చేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు నాగూరావు నామాజీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రావణ్‌గౌడ్, పార్టీ నాయకులు బంటు రమేశ్, పున్నంచంద్ లాహోటీ, బాబయ్యనాయుడు, శ్రీనివాస్, నర్సింహులు పాల్గొన్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

వివాహేతర సంబంధంతో భర్తను చంపిన భార్య

కొడంగల్, ఏప్రిల్ 26 : ఓ హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. బొంరాస్‌పేట మండల పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన నర్సింహులు ఈ నెల 12న అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టగా.. నర్సింహులు భార్య సుమలతకు అదే గ్రామానికి చెందిన మహ్మద్ బాబాకు చాలా రోజుల నుంచి వివాహేతర సంబంధం కొనసాగుతున్నది. దీంతో నర్సింహులును ఎలాగైనా చంపాలని ఆయన భార్య బాబాతో రూ.5లక్షల బేరం కుదుర్చుకున్నది.

ఇద్దరూ కలిసి ఫిబ్రవరి 9న నర్సింహులు గ్రామానికి నడుచుకుంటూ వస్తుండగా వెనుక నుంచి బొలేరో వాహనంతో ఢీకొట్టించడంతో కాలు విరిగింది. వారు చేసిన హత్యాయత్నం విఫలం కావడంతో బాబా, సుమలత కలిపి పూడూరు గ్రామానికి చెందిన బాబా స్నేహితుడు ఖాసీంను సంప్రదించారు.

ఈ నెల 11న నర్సింహులు ఇంట్లో పడుకొని ఉండగా ఆయన ముక్కు దగ్గర ఖాసీం లైసర్ నూనె వేసి బట్ట పెట్టి గట్టిగా వత్తాడు. బాబా ఆయన గొంతుపై గట్టిగా నొక్కగా ఆ సమయంలో సుమలత కాళ్లపై కూర్చుని బయట నుంచి ఎవరూ రాకుండా కొడుకు ఆకాశ్‌ను కాపలాగా ఉంచింది. నర్సింహులు మృతి చెందడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ కేసుకు సంబంధించి సుమలత, ఆకాశ్, మహ్మద్ బాబా, ఖాసీంలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

బీజేపీతో ఒరిగిందేమీ లేదు

తాండూరు పట్టణంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి

యాలాల, ఏప్రిల్ 26: మతతత్వ బీజేపీతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో కలసి తాండూరు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మతం పేరుతో, గుడి పేరుతో ఓట్లు అడగడానికి మన ముందుకు వస్తున్న వారికి బుద్ధి చెప్పే బాధ్యత ఓటర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్లాక్‌లో ఐపీఎల్ టికెట్లు

ఇద్దరు అరెస్ట్.. 100 టికెట్లు స్వాధీనం

సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బ్లాక్‌లో ఐపీఎల్ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ రష్మిపెరుమాల్ కథనం ప్రకారం.. బెంగళూర్‌కు చెందిన చిత్తూరు రమణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా... న్యాలకంటి సామ్యుల్ హైదరాబాద్‌లో డిజిటల్ మార్కెటింగ్ చేస్తున్నాడు. ఇద్దరికి క్రికెట్ అంటే ఇష్టం, సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ గ్రూప్‌లో స్నేహితులయ్యారు. గతంలో చిత్తూరు రమణ బెంగళూర్‌లో వన్డే క్రికెట్ మ్యాచ్ టికెట్లు బ్లాక్‌లో విక్రయిస్తుండగా చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు. అయినా తన తీరు మార్చుకోలేదు. ఐపీఎల్ మ్యాచ్‌కు భారీ డిమాండ్ ఉండటంతో క్రికెట్ ప్రియులతో కలిసి వెయ్యి మందికిపైగా సభ్యులను చేర్చుతూ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నకిలీ ఐడీలు, ఈ మెయిల్ అడ్రస్‌లు తయారు చేసి ఆన్‌లైన్ నుంచే భారీగా టికెట్లు కొనుగోలు చేశారు. తమ వద్ద క్రికెట్ ప్రియులకు సంబంధించిన వాట్సాప్ గ్రూప్ ఉండటంతో అందులో టికెట్లు ఉన్నాయంటూ వాటిని విక్రయిస్తున్నారు. కాని ఈ ఇద్దరు వివిధ ఐడీలతో భారీగా టికెట్లు కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. కాగా హైదరాబాద్‌లో గురువారం ఎస్ఆర్‌హెచ్, ఆర్‌సీబీ మధ్య ఐపీఎల్ మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లను గురువారం బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 100 ఐపీఎల్ టికెట్లను స్వాధీనం చేసుకున్నారు.

ఫార్మా పరిశ్రమలో అగ్ని ప్రమాదం

మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

కొత్తూరు, ఏప్రిల్ 26: నందిగామ మండల కేంద్రంలోని అలిన్ ఫార్మా పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో పరిశ్రమలో ఉన్న ఆరుగురు కార్మికులు ఉండగా అందులో ఐదుగురిని అగ్ని మాపక సిబ్బంది, స్థానికులు రక్షించారు. ఓ కార్మికుడు కిటికీ నుంచి కిందకు దూకడంతో గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. అయితే పరిశ్రమలో వెల్డింగ్ పనులు చేస్తుండగా నిప్పురవ్వలు ఎగిసి పడి పక్కనే ఉన్న థర్మకోల్, ఇతర సామగ్రి మీద పడి మంటలు అంటుకున్నాయి. పరిశ్రమ అవసరాల 15 డ్రమ్ముల ఆల్కహాల్ నిల్వ ఉంచారు. ఆల్కహాల్ డ్రమ్ముల వరకు వ్యాపించడంతో మంటలు తీవ్రమయ్యాయి. మండల కేంద్రానికి పరిశ్రమ కూత వేటు దూరంలో ఉండటం, పక్కనే ఇతర పరిశ్రమలు ఉంటడంతో మండలు అక్కడి కూడా వ్యాపిస్తాయిని ప్రజలు భయపడ్డారు. అయితే ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు పక్క పరిశ్రమలకు వ్యాపించకుండా అదుపు చేశారు.

కార్మికులను కాపడిన బాలుడు

పరిశ్రమలో మంటలు వ్యాపించడంతో అక్కడే ఉన్న సాయిచరణ్ అనే బాలుడు పరిశ్రమ పై అంతస్తుకు ఎక్కి అందులో ఉన్న కార్మికులను తాడుతో కిందకు దించేందుకు సహాయం చేశాడు. కార్మికుల ప్రాణాలను కాపాడిన సాయిచరణ్‌ను డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు.

పరిశ్రమను సందర్శించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశ్రమను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను సురక్షితంగా బయట పడ్డ కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే సహాక కార్యక్రమాలను జరిశీలించారు. ఎలాంటి ప్రమాదం జరుకుండా జాగ్రత్తలు తీసుకున్న పోలీస్, ఫైర్ సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు.

సాయిచరణ్‌ను అభినందిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

బ్యాంకు ఖాతాకు డబ్బు పంపిస్తానని మోసం

వెంగళరావునగర్, ఏప్రిల్ 26 : బ్యాంక్ ఖాతాకు డబ్బు క్రెడిట్ చేస్తానని బురిడీ కొట్టించిన ఘటన పై మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... సనత్ నగర్‌కు చెందిన దాసరి సురేశ్ బాబు ఆఫీస్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 25న మధ్యాహ్నం అతడి అధికారి ఎన్.సత్యనారాయణతో కలిసి యూసుఫ్‌గూడ ఎస్‌బీఐ బ్యాంకు ఏటీఎంలో డబ్బు డిపాజిట్ చేయడానికి వెళ్లాడు. అతడి అధికారి సత్యనారాయణ కారులో ఉండగా..రూ.47 వేలు డిపాజిట్ చేయడానికి ఏటీఎం రూమ్‌లోకి వెళ్లాడు. అదే సమయంలో ఓ వ్యక్తి డబ్బు ఇస్తే.. ఆన్‌లైన్‌లో బదిలీ చేస్తానని నమ్మించాడు. దీంతో సురేశ్ తన అధికారి ఫోన్ నంబర్ చెప్పాడు. అనంతరం ఆ వ్యక్తి రూ.15 వేలు తీసుకుని..ఫోన్ పే ద్వారా డబ్బు పంపినట్టు స్క్రీన్ షాట్ చూపి వాట్సాప్ సందేశం పంపాడు. అనంతరం మరో రూ.5 వేలు తీసుకుని ఆన్‌లైన్‌లో పంపిస్తానంటూ మెల్లిగా అక్కడి నుంచి జారుకున్నాడు.

ఆన్‌లైన్ ఫోన్‌పే లో చూస్తే.. ఆ డబ్బు జమ కాలేదు. రూ.20 వేలతో ఉడాయించినట్టు గ్రహించి బాధితుడు సురేశ్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

PUBLIC NOTICE

I. The Notice is hereby given to General Public that our client is intending to purchase All that Dry Agricultural land in Survey No.1235 admeasuring Ac 2.13 gts situated in Nandigama (V) Kotur Revenue Mandal, Mahaboobnagar District at Sub-Registrar office, Shadnagar Registration District Mahaboob nagar - State of Telangana. bounded by:North: Remaining Land in survey No. 1235, South:Survey Nos 1264 &1265,East: 33 feet Yasakul Nandigama road abutting the new N-H-7 bypass Road ,West: Survey No. 1236. Any person having or claiming any right, interest, claim, demand or benefit whatsoever in respect of the Schedule Property by way of sale, exchange, mortgage, gift, trust, development rights, inheritance, bequest, possession, lease, license, tenancy, lispendens, lien, charge, maintenance, easement or under any Agreement or Power of Attorney whatsoever or otherwise howsoever, is hereby required to notify the same in writing with documentary proof thereof to the undersigned at the address as mentioned below, within Seven (7) days from the date hereof, failing which it shall be construed that either there is no claim, demand, right or interests whatsoever in or over the Schedule Property adverse to the aforesaid owner or the same has been waived for all intents and purposes and sale shall be completed.

Sd/- **PRAVEEN KUMAR JAIN,** B.A, LL.M
Advocate
H.No:14-1-18, Near Police Station
Mangalhat, Hyderabad-500006.
Cell: 9851609064

క్రికెట్ బెట్టింగ్...

వ్యక్తి అరెస్టు

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 26 : ఆన్‌లైన్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని కుల్సుంపురా పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ కృష్ణవేణి కథనం ప్రకారం.. కార్వాన్ బంజారావాడికి చెందిన అంబటి శ్రీకాంత్(36) ప్రైవేట్ ఉద్యోగి. కాగా సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో శుక్రవారం కోల్‌కతాలో జరుగుతున్న కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ మ్యాచ్ బెట్టింగ్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు అందుకున్న సమాచారం మేరకు పోలీసులు శ్రీకాంత్ ఇంటికి చేరుకున్నారు. ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పూర్తి స్థాయిలో శ్రీకాంత్‌ను విచారించిన అనంతరం క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నానని అంగీకరించడంతో అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 22 వేల 900 నగదుతో పాటు ఒక ఎంఐ 11 ఎక్స్ మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగిలించిన సెల్‌ఫోన్లు సూడాన్‌కు..

పట్టుబడ్డ అంతర్జాతీయ సెల్‌ఫోన్ దొంగల ముఠా 17 మంది అరెస్ట్, 703 సెల్‌ఫోన్లు స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): నడుకుచుకుంటూ వెళ్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని మొబైల్స్‌ను దొంగిలిస్తూ, ఆ ఫోన్లను సూడాన్ దేశానికి తరలిస్తున్న స్థానిక దొంగలతో పాటు అంతర్జాతీయ దొంగలను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. 17 మంది ముఠా సభ్యులతో పాటు వారి నుంచి 703 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలను బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తాడ్‌బన్‌కు చెందిన మహ్మద్ ముజమిల్ అలియాస్ ముజ్జు మండపాల డెకరేషన్ వర్క్ చేస్తుంటాడు. ఇతని స్నేహితుడు జహునా మకు చెందిన సయ్యద్ అబ్రార్ డ్రైవర్. ఇద్దరూ కలిసి విలాసవంతమైన జీవితాన్ని గడిపేందుకు ఎల్బీనగర్‌లో ఒక పల్సర్ బైక్‌ను దొంగిలించారు. బైక్‌పై రాత్రి వేళల్లో పలు ప్రాంతాల్లో తిరుగుతూ ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లే వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు దొంగిలించారు. దొంగిలించిన ఫోన్లను మహ్మద్ సలీంకు అందజేస్తారు. ఈ ఫోన్లకు మంచి డిమాండ్ ఉండటంతో పఠాన్ రబ్బాని ఖాన్, మహ్మద్ అత్తార్, మహ్మద్ జకీర్, షేక్ అజార్, మహ్మద్ ఖాజా నజీముద్దీన్, సయ్యద్ లాయఖ్, షేక్ అజార్ మొహినుద్దీన్, మహ్మద్ షఫీ, యలమందారెడ్డి లతో ఒక గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అలాగే సూడాన్ దేశానికి చెందిన ఖలీద్ అదెనబాగి మహ్మద్ అల్బద్వి మాసబ్ ట్యాంకులో సెల్‌ఫోన్ బిజినెస్ చేస్తుండగా, అబదాలా అహ్మద్ ఉస్మాన్ బాబికర్ బట్టల వ్యాపారం చేస్తున్నాడు. అలాగే మరో ముగ్గురు సూడాన్ నుంచి విద్యార్థి వీసాపై ఇక్కడ చదువుకోవడానికి వచ్చారు. ఈ క్రమరంలో అబిడ్స్ జగదీష్ మార్కెట్‌లో సూడాన్ దేశస్తులకు, ముజ్జు గ్యాంగ్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో ముజ్జు గ్యాంగ్ ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో దొంగిలించిన సెల్‌ఫోన్లను సూడాన్ దేశస్తులకు విక్రయిస్తున్నారు. ఇలా సెల్‌ఫోన్లు కొని సముద్ర మార్గంలో కంటైనర్లలో సూడాన్ దేశానికి తరలిస్తున్నారు. అక్కడ ఈ ఫోన్లను ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ గ్యాంగ్‌ను పట్టుకున్నామని సీపీ తెలిపారు. అరెస్టు అయిన 17 మందిలో 12 మంది హైదరాబాద్‌కు చెందిన వారు కాగా మిగతా ఐదుగురు సూడాన్ దేశానికి చెందిన వారని పేర్కొన్నారు.

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య

బంజారాహిల్స్, ఏప్రిల్ 26 : భార్యతో జరిగిన గొడవతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్‌బీటీనగర్‌లో నివాసం ఉంటున్న దేరంగుల చిరంజీవి(35)కి భార్య వసంతతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. రోజూ తాగివస్తున్న భర్తను భార్య మందలిస్తుండటంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నాలుగురోజుల క్రితం పిల్లలను బాబాయ్ రంగస్వామి సొంతూరైన అనంతపురం తీసుకువెళ్లాడు. కాగా రాత్రి 8గంటలకు మరోసారి మద్యం సేవించి ఇంటికి వచ్చిన చిరంజీవితో భార్య గొడవకు దిగింది. మాటామాటా పెరగడంతో ఆగ్రహంతో వసంత ఇంట్లోనుంచి వెళ్లిపోయింది. రెండు గంటల తర్వాత ఇంటికి వచ్చి చూడగా భర్త చీరతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు.

■ ఎన్నికల వ్యయంపై ఆరా..

ఆర్డీవోతో వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల పరిశీలకుడు రాజీవ్ చోప్రా

పరిగి, ఏప్రిల్ 26 : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు రాజీవ్ చోప్రా శుక్రవారం పరిగిలోని ఏఆర్వో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయానికి సంబంధించి వ్యయ నిర్వహణ టీంల పనితీరు తదితర అంశాలను వికారాబాద్ ఆర్డీవో, ఏఆర్వో, ఎం.వాసుచంద్రను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

■ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి



ధాన్యంలోని తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌వో రాజేశ్వర్‌రావు

బొంరాస్‌పేట, ఏప్రిల్ 26 : మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్‌రావు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం బొంరాస్‌పేట, మెట్లకుంట గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. తేమ ఎక్కువగా ఉండకుండా బాగా ఆరబెట్టి, తాలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత లేదని అన్ని సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. బొంరాస్‌పేట కొనుగోలు కేంద్రంలో తూకం చేయడం ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరా శాఖ మేనేజర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

■ ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటర్లకు ఓటరు స్లిప్పులను అందజేస్తున్న తహసీల్దార్ మురళీధర్

కులకచర్ల, ఏప్రిల్ 26 : గ్రామాల్లో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కులకచర్ల తహసీల్దార్ మురళీధర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కామునిపల్లిలో ఓటరు స్లిప్పుల పంపిణీని పరిశీలించారు. అనంతరం కొంతమందికి ఆయన ఓటరు స్లిప్పులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. గ్రామాల్లో ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వందశాతం ఓటుహక్కును వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కామునిపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

■ కేసీఆర్ సభకు తరలిన నాయకులు

బొంరాస్‌పేట, ఏప్రిల్ 26 : కేసీఆర్ బస్సు యాత్ర సందర్భంగా శుక్రవారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగసభకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలి వెళ్లారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోట్ల యాదగిరి, పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, దేశ్యానాయక్ తదితరులు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్ నగర్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని వారు అన్నారు.

■ బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

మోత్కూర్‌లో పద్మమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న శరత్‌కుమార్‌రెడ్డి

దోమ, ఏప్రిల్ 26 : ఆపద సమయంలో నిరుపేదలకు కేసీఆర్ ట్రస్టు అండగా నిలిచి ఆదుకుంటుందని ట్రసు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామానికి చెందిన మంగలి పద్మమ్మ కొన్ని రోజుల క్రితం రెండు కండ్లకు ఆపరేషన్ చేయించుకోగా, ఒక కన్ను పూర్తిగా కోల్పోయి, రెండో కన్ను నయం కాక ఇబ్బంది పడుతున్నది. ఇదే గ్రామానికి చెందిన మహ్మద్ ఖాజామియా మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక చేయి విరిగిపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఈ విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న శరత్‌కుమార్ రెడ్డి శుక్రవారం వారి ఇండ్లకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఇరువురికి రూ. ఐదువేల చొప్పున ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, లింగయ్య, శ్రీకాంత్, శివ, రాములు, మహేందర్ పాల్గొన్నారు.

ఫోన్‌ట్యాపింగ్ కేసులో బెయిల్ పిటిషన్ల తిరస్కరణ

నాంపల్లి కోర్టులు, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రణీత్‌రావుతోపాటు భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావు తరపున దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను తిరస్కరిస్తూ శుక్రవారం 1వ అదనపు జిల్లా జడ్జి రమాకాంత్‌రావు తీర్పు ప్రకటించారు. నిందితులకు బెయిల్ మంజూరు చేయవద్దని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.సాంబశివరెడ్డి, తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది రమాకాంత్‌రెడ్డి కోర్టుకు తెలిపిన వివరాలను ఏకీభవిస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో బెయిల్ మంజూరు చేసినట్లైతే సాక్షులను, సాక్ష్యాధారాలని తారుమారు చేసే అవకాశముందని పీపీ చేసిన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది.